


ఎర్రగా, సన్నగా, ఎత్తుగా ఉండే సాంబశివరావుకు ఇంటర్వ్యూ వచ్చింది! ఇంటర్వ్యూ వచ్చిన సాంబశివరావు ఇంటర్మీడియట్ పాసయ్యాడు. ఇక ఆపైన చదవలేకపోయాడు.

వృద్ధుడై, రోగై కుటుంబ బాధ్యతంతా సాంబశివరావు భుజాల మీద పెట్టాడు అతని నాన్న! ఆరెకరం స్థిరాస్తి, అవిటి గేదె, పెళ్ళీడు కొచ్చిన చెల్లి, చదివే తమ్ముడూ చరాస్తులుగా మిగిల్చి విశ్రాంతి తీసుకోటానికి ఉద్యుక్తుడయాడు.

తల్లి చనిపోయి నాలుగేళ్ళయ్యింది.

చెల్లెలే వండటం— వార్చటం!

కొన్నాళ్ళు రైస్‌మిల్లులో గుమాస్తాగా పనిచేశాడు. ఆ తరవాత అది వూడిపోయే సరికి అరిగిపోయిన సైకిలొకటి సంపాదించి, ఐదు మైళ్ళ దూరంలో ఉన్న పట్నానికి పాల క్యాన్లతో తిరగటం మొదలుపెట్టాడు.

అయిదారు రూపాయలు అందులోనే ప్రతి రోజూ మిగలటం అతనికి కొంత ఆశను కలిగించింది.

అరిగిన సైకిలు మీద తిరిగేప్పుడు అతని కో ఆలోచన వచ్చింది. వచ్చే వాళ్ళం ఎటు తిరిగీ వస్తున్నాం కాబట్టి, టైపూ, షార్ట్‌హాండూ నేర్చుకుంటే, నిరుద్యోగుల ఆఫీసులో 'పేరు' రిజిస్టరు చేసుకుంటే ముందు ముందు ఉపయోగం— ఎందుకైనా మంచిదనుకున్నాడు!

పర్మనెంట్ హోటల్ని ఒకదాన్ని చూసుకు పాలు దానికే రోజూపోస్తూ, టైపొగంటా, షార్ట్ హాండ్ ఒక గంటా ప్రాక్టీస్ చేస్తూ మూడు కేలండర్లని మార్చాడు. ఈలోగా టైపు హయ్యరూ, షార్ట్‌హాండు లోయరూ పూర్తయ్యాయి.

నేనింకా నిరుద్యోగినే అని మూడేళ్ళ నుండీ ఎంప్లాయిమెంట్ ఆఫీసులో మొత్తుకుంటూనే ఉన్నాడు!

కడ కెలాగుంటేనేం, వాళ్ళు కలెక్టరేట్‌లో ఏవో క్లర్కు జాబ్స్ ఖాళీగా ఉన్నాయంటూ ఒక 'కాల్' పడేశారు!

ఇంటర్వ్యూ చూసే ఇంటర్మీడియట్ సాంబశివరావు ఉద్యోగ మొచ్చినంతగా ఉబ్బిపోయాడు.

ఈ ఉద్యోగమే వస్తే. చెల్లెలికి పెళ్ళి చెయ్యొచ్చు. తమ్ముడిని చదివించవచ్చు. ఇంట్లో ఎప్పుడూ మూలిగే నాన్నను అడపా, దడపా ఆస్పత్రుల చుట్టూ తిప్పొచ్చు. అనారోగ్యం పోగొట్టొచ్చు.

తరవాత తనూ పెళ్ళి చేసుకోవచ్చు.

పట్నంలో కాపురం పెట్టొచ్చు. ఆదివారాలు వస్తే ఇంచక్కా చిలకలాంటి పెళ్ళాన్ని వెంటేసుకు తిరగొచ్చు. సినిమాలకు పోవచ్చు. షికార్లకు పోవచ్చు.

అయితే ఉద్యోగం ఎలా వస్తుంది?!

సాంబశివరావు ఆలోచించటం మొదలుపెట్టాడు!

సిఫార్సు కావాలి!

డబ్బు కావాలి!

రోజు కయిదు రూపాయలు ఖరీదు చేసే తను, అవిటి సైకిలుతో అతుకుల రోడ్డు మీద తిరిగే తను, పాలమ్ముకుంటూ కాలం గడిపే తను, ఆర్థికంగా, సాంఘికంగా అవగింజంత విలువలేని తను సిఫార్సు ఎక్కడ నుండి తేగలడు?

ధనం ఎక్కడ నుండి తేగలడు?

సాంబశివరావుకు చెమటలు పట్టాయి.

• • •

చెమటలు పోస్తున్న సాంబశివరావుకు చివరి కో ఆలోచన వచ్చింది!

"రైస్ మిల్లు రంగనాథం దగ్గరికి పోతే . . ."

ఆయన దగ్గర కొన్నాళ్ళు గుమాస్తాగా చేశాడు తను. అనారోగ్యంతో అదివరకున్న గుమాస్తా ఆసుపత్రిలో చేరినప్పుడు ఆయనే తనను పిలిపించాడు.

"ఒక నూట ఇరవై రూపాయలిస్తాను. నాలుగు నెల్లపాటు చేస్తావుటోయ్" అన్నాడు.

అప్పుడు తను సంతోషంగా తలూపి, నాలుగు నెలలూ లెక్కలూ అవీ చక్కగా వ్రాసి పెట్టడం జరిగింది!

దస్తూరీ బాగుందని ఆయన తెగ పొగిడేవాడు.

'పైకొస్తావోయ్!' అంటూ పదేపదే అనేవాడు.

తనంటే అభిమానంగా ఉండేవాడు.

ఇప్పుడు ఇంటర్వ్యూ సంగతి చెబితే—సాధ్యమయితే సాయం చెయ్యకపోడు.

అసలు రంగనాథానికి సాధ్యం కాని దుంటుందా?

నిండుగా, కుండలా ఉండే రంగనాథం — నడుస్తూంటే పెద్ద పులి కదులుతున్నట్టుండే రంగనాథం—వెడల్పుగా ఉండే ముఖంలో ఎర్రని కళ్ళుండే రంగనాథం—ఫ్యాక్టరీలూ, పొలాలూ, బాంక్ అకౌంట్స్ ఉన్న రంగనాథం — పట్టణం ప్రతి రోజూ తిరిగే రంగనాథం — తలచుకుంటే కానిదంటూ ఉంటుందా?

సాంబశివరావుకు ధైర్యమొచ్చింది.

వచ్చిందే తడవుగా ఇంటర్వ్యూ కార్డునీ, విరిగి అతుకులు పడ్డ సైకిలునీ బయటకు తీశాడు!

సరాసరి రంగనాథం భవంతికి వెళ్ళాడు.

## 2

అర తాడెత్తు భవంతి. పైనో అంతస్తు, క్రిందో అంతస్తు! గేటుకు అటూ, ఇటూ రెండు సింహాలు!

'రంగనాథానికి సింహాలంటే ఇష్టం కాబోలు!'

సాంబశివరావు మనసులో అనుకుని, సైకిలు బయటనే స్టాండు వేసి మెల్లిగా సింహాల మధ్యగా ఇంటిముందు కెళ్ళి నిలబడ్డాడు.

అప్పుడే భోంచేసి రంగనాథం బయటికొచ్చాడు. మనిషికి వంటి మీద చొక్కా లేదు. గళ్ళ లుంగీ

మాత్రం ఉంది! శరీరం మొత్తం కండపట్టి నున్నగా, గుండ్రంగా ఉన్నాడు. సన్నగా, ఎర్రగా ఉండే సాంబశివరావు విందుగా ఉన్న రంగనాథం వంటి కండల్ని చూసి కాస్సంత మనసులో ముచ్చట పడ్డాడు.

"ఏమిటోయ్ సాంబశివరావు—ఇలా వచ్చావ్?" ముందుగా రంగనాథంగారే పలకరించారు.

"తమతో పనుండే వచ్చానండి!" వినయంగా సమాధానమిచ్చాడు.

"ఏమి టా పని?"

"ఇంటర్వ్యూ వచ్చిందండి."

"దేనికి?"

"కలెక్టరేట్‌లో క్లర్క్ పోస్ట్సు ఖాళీగా ఉన్నాయట—"

"ఏదీ—మన జిల్లా కలెక్టరేట్‌లోనే. . ."

"మన జిల్లాలోనే సార్—"

"అయితే అదెంత పనోయ్. వాళ్ళంతా మనకి తెలిసిన వాళ్ళేగా—కలెక్టరుగారు మనకు బాగా పరిచయం గూడా—ఎప్పుడేమిటి?"

"ఇంకో అయిదు రోజులుంది సార్."

"మరీ మంచిది—"

సాంబశివరావు గుండె వేగంగా కొట్టుకోవటం మొదలెట్టింది. 'ఉద్యోగం ఇంత తేలిగ్గా ఉంటుందా?' అసలు ఇంతకాలం ఎంత బుద్ధి తక్కువ పని చేసిందీ సాంబశివరావుకు ఆ సమయంలో స్పష్టంగా అర్థమయ్యింది.

రంగనాథం తనో కుర్చీలో కూర్చుని సాంబశివరావును మరో కుర్చీలో కూర్చోమన్నాడు. సాంబశివరావు మొహమాటపడ్డాడు. 'ఫరవాలేదులే, కూర్చోనాయ్' అంటే గాని కూర్చో లేకపోయాడు.

కుర్చీలో కూర్చుంటుంటే సాంబశివరావుకు శరీరమంతా తేలిపోతున్న ట్టనిపించింది. ఆ కూర్చుంది కలెక్టరేట్‌లో ఉన్న కుర్చీ మాదిరిగానే ఫీలయ్యాడు. ఇకముందు తానక్కడే కుర్చీల్లో కూర్చుంటూ, అందులో ఉన్న ఫైళ్ళన్నీ తన అందమైన దస్తూరితో వ్రాస్తున్నట్టూ, తన వ్రాతని చూసి పై ఆఫీసర్లు తెగమెచ్చుకుంటున్నట్టూ—ఏదేదో జరుగుతున్నట్టూ ఫీలయ్యాడు.

"అయితే సాంబశివరావ్" అని రంగనాథం అనగానే "ఏమిటి సార్" అంటూ సాంబశివరావు ఉలిక్కి పడ్డాడు.

"ఒక ఇబ్బందుందోయ్."

"ఏమిటి సార్?"

"మరేం లేదు. కాస్త మనీ పలుకుతుంది. సిఫార్సు మాత్రం పెట్టుకోలేవ్."

గుండెలో రాయి పడ్డట్టై..?

"ఎంతవుతుంది సార్" అంటూ అడిగాడు..

'ముందో వెయ్యి రూపాయల దాకా పలుకుతాయ్ పనయితే మరో వెయ్యి ఇచ్చుకోవాలి."

సాంబశివరావుకు మాట పెగల్లేదు. గొంతులో ఏదో అడ్డం పడ్డట్టూ, గుండె మొత్తం బరువుగా ఉన్నట్టూ తలచాడు.

రెండు వేలు తేవట మంటే మాటలా? తానెక్కడి నుండి తెచ్చుకోగలడు?

"కలెక్టరేట్‌లో ఉద్యోగమంటే మాట లను కున్నావుటోయ్. నా లాంటి వాళ్ళందరికీ ఆ ఆఫీసులో పనే—రెండు వేలా ఒక్క ఏడాదిలో సంపాదించేస్తావ్ నా మాట్టకు కన్నే చూడరాదూ—ప్రతి ఏడాదీ రెండు మూడు వేలన్నా అక్కడ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఏదీ. . . కలెక్టర్ కనుక్కున్నావా? కలెక్టర్ గారికి కావేకాదు. కేవలం క్లర్క్సుకి కొత్త పరిశ్రమకి లైసెన్సుల దగ్గర నుండి, ఫ్యాక్టరీలో బియ్యం రవాణా పర్మిట్ల దగ్గర నుండి అన్నాంబాపతు పనులన్నిటికీ అక్కడ మామూలు చెల్లించుకోవాల్సిందే. అక్కడ ఉద్యోగమే దొరకాలికాని రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే అనుక. అస లక్కడ ఉద్యోగ మంటేనే చాలుగదోయ్. ఒక పటేలుసా, ఇవ్వై వేలిచ్చి ముందుగా పిల్ల నిస్తారు. అలా వచ్చిన కట్నం చక్కగా బ్యాంక్‌లో వేసుకుని వడ్డీలు పెంచుకుంటూ, పై నొచ్చే డబ్బులతోనే సంసారాన్ని మొత్తం నెట్టెయ్యొచ్చు. . . అన్నట్టు ఒక చెల్లెలూ, తమ్ముడూ ఉన్నారన్నావ్ కదూ. చెల్లెలుకు వివాహం చేయొచ్చు. తమ్ముడ్ని చదివించొచ్చు. మొత్తానికి అదృష్టవంతుడివోయ్. . ." రంగనాథం చెప్పుకు పోతున్నాడు.

సాంబశివరావుకు మళ్ళా ఏదో సంతోషం...

రెండు వే లెక్కడి నుండి తేవాలనుకున్నప్పుడు దుఃఖం.

అతని మనసు ఎత్తు పల్లాల మీదికి ఎగురుతూ, పడుతూ విచిత్రంగా ధ్వనించటం మొదలెట్టింది.

"ఏమిటి?" రంగనాథం ప్రశ్నించాడు.

"రెండు వే లెక్కడ దొరుకుతాయి సార్."

"బజారులో దొరకవు. ఏదైనా ఉపాయం ఇంట్లో నుంచే ఆలోచించాలి, రంగనాథం పెద్దగా నవ్వి చిన్నగా అన్నాడు.

"మా నాన్నగార్నికూడా కనుక్కొని చెపుతా సార్"

"నీ ఇష్టం."

రంగనాథం ఇంట్లోకి పోయాడు. సాంబశివరావు బయటి కొచ్చాడు.

## 3

విషయా న్నంతా మూలిగే నాన్నకూ, అర్థం కాని చెల్లికీ, అయోమయంగా చూసే తమ్ముడికీ చెప్పాడు.

"అరెకరం అమ్మేసెయ్యరా—నీ కుద్యోగం రావాలే కాని పొలం దేముంది. మరలా కొన్నాళ్ళకు కొనుక్కో కూడదూ."

తండ్రి చెప్పిన విషయాన్ని చెల్లెలుకూడా సమర్థించింది.

పొలం అమ్మటం ఇష్టం లేకపోయినా ఆ సమయంలో రంగనాథం మాటలు జ్ఞాపకాని కొచ్చాయి.

'బజారులో దొరకవు—ఏదైనా ఉపాయం ఆలోచించాలి.'

"ఇప్పు డెవరు కొంటారు నాన్నా దాన్ని?" సాంబశివరావు సందేహంగా పొలం అమ్మితేనే పరిష్కారం జరుగుతుందన్నట్టు అడిగాడు.

"ఇంకా ఎవరో ఎందుకురా? రంగనాథమే తీసుకుంటాడు. అమ్మాలే గాని అక్కడి ఆయకట్టులో పొలం మొత్తం కొంటాడు. అసలాయన పొలం కూడా ఆ కాలవకిందేగా ఉంది."

తండ్రి ఆ మాట అనేసరికి సాంబశివరావు కొద్దిగా చలించిపోయాడు. రంగనాథం అందుకే తనతో ఆ మాట అన్నాడా? అతని మనసు కలవర పడింది.

అమ్మదలుచుకున్నప్పుడు కొనే అరెకరం ఎవరు కొంటే ఏం? రంగనాథమే కొంటే. . . పొలం అమ్మారన్న కృతజ్ఞతతో నన్నా సక్రమంగా చేసి పెడతాడు.

ఉద్యోగం తాలూకు తీయటి ఊహలు అతని కలవరాన్ని వెంటనే అణిచాయి.

ఆ రోజు రాత్రే—అదే విషయాన్ని రంగనాథంతో అన్నాడు.

● ● ●

మరునటి రోజే రోగంతో ఉన్న తండ్రిని అలాగే తీసుకుపోయి చేను మొత్తం రంగనాథానికి రిజిస్టరు చేయించాడు.

మార్కెట్ రేటు కంటే తొమ్మిది వందలు తక్కువగా రంగనాథం చేతిలో పెట్టాడు. సాంబశివరావు ఆ విషయాన్ని గట్టిగా అడగలేకపోయాడు.

ఇంకెవరికైనా ఆ పొలాన్ని అమ్మినట్లయితే అయిదువేల రూపాయలదాకా వచ్చేవి కానీ ఇప్పుడు తమకు వచ్చింది మొత్తం నాలుగు వేల రెండు వందలు!

అందులో నుంచి రెండు వేల రూపాయలని మరలా తాము అప్పుడే ఆయన చేతిలో పెట్టారు.

తర్వాత రంగనాథాన్ని రెండు మూడుసార్లు ఆఫీసుల చుట్టూ తిప్పేసరికి వంద రూపాయలు దాకా అయిపోయాయి. ఉద్యోగం వస్తే ఒంటి మీద బట్టలు లేవని రెండు వందలు ఖర్చు చేసి ఒక మాదిరి గుడ్డలు రెండు జతలు కుట్టించుకున్నాడు. ముసలి తండ్రిని ఏదో ఆసుపత్రికి తీసుకుపోయి ఒక అరవై రూపాయల దాకా మందుల మీద ఖర్చు చేశాడు.

ఉన్న వూలొదిలి ఎక్కడికో దూర దేశం పోయే మనిషిలాగా ఎక్కడివక్కడ సర్దుకుని, ఉన్న పాల బేరాని క్కూడా స్వస్తి చెప్పి, దాన్ని కాస్త ఎవరో కుర్రాడికి అప్పజెప్పి అంతా సిద్ధమై సాంబశివరావు కూర్చున్నాడు!

ఇంటర్వ్యూ అయిపోయి వారాలు గడిచాయి. నెలలు గడిచాయి.

అయినా సాంబశివరావుకు ఉద్యోగం ఆర్డర్లు రాలేదు.

ఆ రోజు రంగనాథం పిడుగులాంటి వార్త ఒకటి చెప్పాడు.

"చాలా దెబ్బ తిన్నామోయ్ సాంబశివరావ్! కష్టపడి నీ పేరు సెలక్షన్ లిస్టులో ఎక్కించా కాను. నీ విచ్చిన రెండు వేలల్లో క్లర్కు—దగ్గర నుండి చెప్ప కూడదనుకో — కలెక్టర్ దాకా అలా అలా సర్దాను. తీరా ఇప్పుడు కలెక్టర్ గారికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. ఆయనేమో బాధ్యతంతా కొత్తాయన కప్పజెప్పి మెదలకుండా పోయేడు. ఆయన మంచి ఘటికుడంట. పైసా తినడంట. ఖచ్చితంగా పని చెయ్యడంట.

ఆ లిస్టు మొత్తం అలాగే ఉంచేసి, కొన్నాళ్ళు

గడిచాక కాన్సిల్ చేసి, మరలా కొత్తవాళ్ళని తీసుకుంటాడట—అనవసరంగా పాపం ఆరెకరం అమ్మావ్ ఈనగాచి నక్కల పాలయినట్లు ఆ మనీ అంతా వృథా అయిపోయింది. అన్నట్టు మరో పదిహేను వందల దాకా ఉన్నాయనుకుంటాను. ఒక అయిదారొందలు ఖర్చయినా ఆ మనీ మాత్రం భద్రంగా దాచి పెట్టు. ఈసారి గట్టిగా ట్రై చేద్దాం! అన్నాడు.

సాంబశివరావుకు ఏడవాలో నవ్వాలో అర్థం కాలేదు. అలాగే కాస్సేపు కొయ్యబారి నిలుచుండిపోయాడు. రంగనాథం చెప్పేది నిజమో, కాదో తెలీలేదు. ఆయన సెలెక్టు చేస్తే ఈయ నెందు కాపుతాడో అంతకంటే అర్థం కాలేదు. ఆవేశం కట్టలు తెంచుకున్నా గుప్పున మండి ఆరిపోయిన అగ్నిలా ఆగిపోయింది!





శుద్ధమైన ఎఓ కొబ్బరినూనె కొబ్బరికాయల యొక్క సహజమైన గుణాలు, తీయని పరిమళం నిలిపేందుకుగాను రెండుసార్లు వడగట్టబడుతుంది.

శుద్ధమైన ఎఓ కొబ్బరి నూనె ఎన్నికచేయబడిన ఎండు కొబ్బరి చిప్పలనుండి తయారుచేయబడుతుంది రెండుసార్లు వడకట్టబడుతుంది. స్ఫటికంలా స్వచ్ఛమైనది. కొబ్బరి కాయల తీయని పరిమళంగలది.

శుద్ధమైన ఎఓ కొబ్బరి నూనె— సంవత్సరాలుగా శుద్ధతకు పేరెన్నికగన్నది




ఆరోగ్యకరమైన రీతిలో సీల్ చేసిన టిన్ లు : 5 సైజులలో సీసాలు : 2 సైజులలో

అహమద్ మిల్స్
బొంబాయి • కలకత్తా • న్యూ ఢిల్లీ
అహ్మదాబాద్ • బెంగుళూర్ • ధన్ బాద్

Grant.8 TL(R)

మెల్లిగా బయటికి వచ్చాడు.

తనకు ఇంటర్వ్యూ వచ్చిన మాట వాస్తవం—

తను ఆ ఇంటర్వ్యూకి వెళ్ళిన మాట వాస్తవం—

అక్కడ వాళ్ళేవో ప్రశ్నలడిగితే సమాధానం చెప్పిన మాట కూడా వాస్తవం.

ఈ వాస్తవాన్ని ఆధారం చేసుకునే రంగనాథం ఒక అవాస్తవమైన నాటకం ఆడాడు. తనకు ఆరు నెలల గ్రాసమైన అరెకరాన్ని అతి చౌకగా కొనేశాడు.

దాని బాపతు అతడు తనకు చేతిలో పెట్టింది రెండువేలరెండు వందలు మాత్రమే! అందులో మరలా ఒక వంద రూపాయలు ఖర్చు చేసి, రంగనాథాన్ని ఆఫీసు చుట్టూ త్రిప్పటం జరిగింది. ఈ రెండు మూడుసార్లు రంగనాథం తన విషయం మాట్లాడి ఉండడు.

మిల్లులో మూల్గే బియ్యాన్ని ఏటో దొంగ రవాణా చేసేందుకు దొంగ పర్మిట్లను సంపాదించు కోవటానికి ఏదేదో మాట్లాడి ఉంటాడు.

ఉద్యోగం సంగతలా ఉంచితే ఒక ఇంటర్వ్యూ కార్డు తననింత అన్యాయం చేస్తుందని కలలో కూడా అనుకోలేదు.

సాంబశివరావు కళ్ళెర్రబడ్డాయి!

ఇంటర్వ్యూల తంతు ఇలా ఎందుకు జరగాలో, తనలాంటివారిలా ఆశల ఆరాటంలో ఈ మోస గాళ్ళయిన మధ్యవర్తుల నోళ్ళకెందుకు చిక్కాలో తమ పేద జీవితాలు ఎందుకు చితికి పోవాలో ఆలోచించినకొద్దీ తల బరువెక్కటం మొదలయ్యింది.

రంగనాథాన్ని తానొక్కడే ఏమీ చేయలేడు! ఏం చెయ్యటానికీ ఎక్కడ దొరకడు!

అతనికి కసి మొత్తంగా ఒక్కసారి ఇంటర్వ్యూ పంపిన ఆఫీసరు మీదికి పోయింది! అది రావటం వలనే తన పరిస్థితి ఇలా అయ్యిందనీ, పొల బేరం మూలపడిందనీ, నమ్ముకున్న కొంద్ర కాస్తా రంగనాథంలాంటి నక్కల పాలయ్యిందనీ, తీరని అన్యాయం జరిగిందనీ అపార మనస్తాపం ఉద్వేగంతో ఊగిపోయాడు—కాసేపటికి చెమటలుగారి చల్లబడ్డాడు! కానీ ఆఫీసరుగారికో ఉత్తరం రాయాలని బలంగా అనుకున్నాడు!

వెంటనే కలమూ, కాగితమూ తీశాడు!

ఎంప్లాయిమెంటు ఆఫీసరుగారికి—

ఇంటర్వ్యూలు పంపే ఆఫీసరు గారికి—

అయ్యా!

నేను నిరుద్యోగిని! మూడేళ్ళ నుండీ తమ ఆఫీసు చుట్టూ తిరిగితే ఒక ముదనష్టపు ఇంటర్వ్యూ కార్డు పంపారు. అసలు మీరా కార్డులు నాబోటి వాళ్ళకెందుకు పంపుతారో అర్థం కాదు. ఉద్యోగాలీ దేశంలో ఎవరెవరికొస్తాయో తమకు తెలుసు. ఆ వచ్చే వాళ్ళకే దయచేసి ఇక మీదట ఇంటర్వ్యూలు పంపండి!

అసలీ ఇంటర్వ్యూల దొంగ నాటకాలెందుకో నాబోటి వాళ్ళకు అర్థం కావటం లేదు.

ఎన్ని ఖాళీలుంటాయో, అవి ఎవరెవరికి ఇవ్వాలో ముందుగానే ఆ ఉద్యోగాలిచ్చే ఆఫీసరుగారికి తెలుసు. ఆ మేరకూ ఒప్పందాలూ, కాంట్రాక్టు బేరాలూ అన్నీ కుదుర్చుకోవటం జరుగుతుంది. మంత్రిగారి మేనల్లుడికో, ఆఫీసరుగారి బావ మరిదికో, బాగా ఉన్నవాడికో, అక్కడి ఆఫీసరు తిన్నవాడికో తప్ప నాబోటివాళ్ళకెప్పుడైనా ఎవరైనా ఉద్యోగాలిచ్చారు అన్నదే నాకు సందేహంగా మిగిలింది.

ఉద్యోగాలు సిఫార్సులూ, మనీ ఉంటేనే తప్ప రావనే 'సత్యం' ప్రతి ఉద్యోగి నర నరాల్లోనూ దాగి ఉందనే విషయం తమకు తెలుసు. అమాయకులైన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు పంపితే దొంగ మనసు దళారీ పెద్దలు తమరు అనవసరంగా కల్పించిన ఈ అవకాశాల్ని వాడుకుని, ఉన్నది కాస్తా వూడ గొట్టి వారిని అన్యాయం చేస్తారనే విషయంకూడా వూహిస్తే తమకు తెలియంది కాదు.

కోపంగా ఉన్నా వినయంగా వ్రాసుకుంటున్నాను.

దయచేసి ఇక ముందు ఏ ఆఫీసులోనైనా ఖాళీ లున్నాయని తమకు ఇంటిమేషన్ వచ్చి, కాండిడేట్స్‌ను పంపమంటే వారు ఎవ రెవరికి ఇస్తారో ముందుగా కనుక్కోండి. వారిచ్చే నిరుద్యోగుల పేర్లకే ఇంటర్వ్యూలు పంపండి. అలాకాక మరో విధంగా చేస్తే ఇప్పుడు నేను బాధ పడ్డట్టే అంతా పడవలసి ఉంటుంది.

తమరికి నా గోడంతా అర్థమయ్యే ఉంటుం దనుకుంటాను. మరో విషయం స్వామీ.

మీ ఆఫీసు కెప్పుడు వచ్చినా అక్కడుండే మీ ఉద్యోగులు మా వంక పురుగుల్ని చూసినట్టు చూస్తారు. కసిరి కొడతారు. అదో రకంగా మాట్లాడ తారు.

అత్తా ఒకింటి కోడలే అన్నట్టు వారూ ఒకనాటి నిరుద్యోగులే అని చెప్పండి. ఆఫీసు కొచ్చిన వారివంక కాస్తంత సానుభూతిగా మాట్లాడమని చెప్పండి. నర్సు నవ్వుతూ రోగి నెలా పలకరిస్తుందో అలా పలకరించమని చెప్పండి.

ఎందుకంటే మేం నిరుద్యోగం జాడ్యంతో ప్రతి క్షణమూ కృశించి పోతున్న ఒక రకమైన రోగులం. ఇక ఉద్యోగం ఇప్పిస్తానని అరెకరం అమ్మించి నమ్మకంగా మోసం చేసిన రంగనాథం మీకు సంబంధం లేదనుకోండి. అయినా కడుపు మంట ఆగటం లేదు. ఆయన చేసిన మోసాన్ని గురించి ఎవరికి వ్రాయాలో అర్థం కావటం లేదు.

ప్రభుత్వానికి వ్రాసి ఏం ప్రయోజనం లేదు. ఎందుకంటే గద్దె కెక్కిన ప్రభుత్వాధి పతులంతా రంగనాథం స్నేహితులే. అసలు ఒక విధంగా చెప్పాలంటే రంగనాథం లాంటి వారే ఈ ప్రభుత్వాల్ని నడుపుతున్నారు. ఎన్నికల్లో చందా లిచ్చి ప్రభుత్వంతో తీరని ఋణానుబంధాల్ని ఏర్పరుచు కుంటున్నారు

వీరిచ్చే చందా లన్నీ ఒక విధంగా ఇలా మా దగ్గర నుండి ప్రోగు చేసినవే.

పోలీసులకు చెప్పినా ప్రయోజనం ఉండదు. వాళ్ళ సంగతి తెలియం దేముంది స్వామీ. వాళ్ళకా దరిద్రపు వారసత్వం మెక్కడ నుండి వచ్చిందో తెలీదు కాని డబ్బు గల వాళ్ళను చిన్న మెత్తు మాటన లేరు.

వాళ్ళ జులుమూ, పెత్తనమూ అంతా నా లాంటి వాళ్ళ మీదే అందుకని అటుకూడా ఆశ వదులుకున్నాను.

నే నిప్పుడు కూరుకుపోయిన నష్టానికి తమరు పంపిన ఇంటర్వ్యూ కార్డే కారణం గనక తమకే వ్రాసుకుంటున్నాను.

ఇకమీదట మీరు కార్డులు పంపటం ఆపేస్తే మేమ్ ఎలాటి ఆశల వ్యామోహాల్లోనూ చిక్కుకుని ఆవేదన పడటం తగ్గుతుంది. మాకు తోచిన ఏ పాల బేరమో, నీరు దొరకని ప్రాంతాలకు నీళ్ళ బేరమో, కూలో నాలో చేసుకు బతుకుతాం.

'ఆర్జి' చేసుకునే యోగ్యత ఎటు తిరిగీ లేదను కోండి ఏమంటారా స్వామీ?

పెళ్ళీడు కొచ్చిన చెల్లీ, చదువుకునే తమ్ముడూ రోగ మొచ్చిన తండ్రీ ఉన్నారు.

చెల్లికి పెళ్ళి చేయకుండా నే నెలా పెళ్ళి చేసు కోను. ఇక తమ్ముడి సంగతి. వాడిని గురించి నాకు దిగులు లేదు.

వాడు చదువుకుంటే చదువుకుంటాడు. మాను కుంటే మానుకుంటాడు. ఎందుకు చదివే వాడు మానుకుంటాడని మీకు సందేహం రావచ్చు. మాను కోక ఏం చేస్తాడు? చదువుకున్న నేను ఏం వెలగ బెడుతున్నాను కనుక? అందుకని వాడి చదువుల మీదా, ఇక్కడి పరిస్థితుల మీదా ఎదురు తిరిగి కసితో ఎటు పోయినా నేను చేసే దేమ్ లేదు.

నేనే ఇంకా ఈ జీవితం వైకుంటపాళీలో నిచ్చెనల కోసం పాకులాడుతున్నాను. కానీ రంగనాథ మనే పాము నన్ను మింగి ఇంకా అధః పాతాళానికి నెట్టింది. ఇక్కడినుండి ఏం జరుగుతుందో చెప్పలేను. మరే పాము నోటికీ దొరక్కుండా ఉన్న ఆ కాసిని డబ్బులూ వూడగొట్టుకోకుండా ఉంటానని గారంటీ లేదు.

అందుకని స్వామీ!

మీరు పంపే ఇంటర్వ్యూ కార్డులు మా కెటు తిరిగీ నిచ్చెనలు కావు. ఆ నిచ్చెనలు ఎక్కి పోయే వాళ్ళు అది వరకే దొంగ చాటుగా ఎక్కి పోతుం టారు.

నా లాంటి వాళ్ళు రంగనాథం లాంటి పాముల నోట్లో పడకుండా ఉన్న బాధల ముళ్ళ దారుల్లోనే అలాగే పోవాలంటే ఇక ముందు నేను విన్నవించుకున్న విషయాన్ని గుర్తుంచుకోండి.

మరి సెలవు ఇకెప్పుడూ తమ నుండి తంతుల మారి ఇంటర్వ్యూ కార్డు లాశించని

ఇంకా విధేయుడుగానే ఉన్న

సాంబశివరావు

ఉత్తరం ముగించి సాంబశివరావు లేచాడు.. పోస్టాఫీసుకు పోయి కవ రొకటి కొనుక్కున్నాడు

కాగితం మడిచి అందులో పెట్టాడు.

ఎంప్లాయిమెంటు ఆఫీసరు అడ్రసు వ్రాశాడు.

కవరు అంటించాడు.

లెటరు బాక్సు దగ్గరికి పోయాడు.

ఉత్తరం వేయబోతే చేతులు వణికాయి. ఈ ఉత్తరం చూసి ఆఫీసరు ఎగిరి పడితే ఎవడీ సాంబ శివరావని ఎంక్వయిరీ చేస్తే.

ఇక ముందు ఇంటర్వ్యూలు పంపకపోతే

పెళ్ళి కాని చెల్లీ

చదువుకునే తమ్ముడూ

రోగ మొచ్చిన తండ్రీ

నేనేం చేయగలడు? తనేం చేయగలడు?

"ఈ సారేదయినా అవకాశం దొరుకుతుందేమో."

సగటు మనిషి సాంబశివరావు నీళ్ళు కారిపోయాడు.

శిలాప్రతిమలా వెయ్యాలా వద్దా అనుకుంటూ అక్కడే నిలుచుండి పోయాడు. *